
# మిస్ యూనివర్స్



డాక్టర్ ఇంద్రాణి గొడవర్తి

'అందం అనేది చూసే కళ్లలో ఉంటుంది; ప్రేమించే మనసుకి తెలుస్తుంది.' ఇలా చెప్పాలనిపించడం వెయ్యోన్నొకటోసారి ప్రియకి.

రాజేంద్ర ప్రియను ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. కానీ ఎందుకో ఈమధ్య అతని ఆలోచనాధోరణిలో చాలా మార్పు వచ్చింది. పెళ్లియ్యాకే భార్య అతని కంటికి ఇదివరకంత అందంగా కనిపించడం లేదు. తన తెలివికీ, వర్ణనాలిటికీ ఆమె సరిపోకపోయినా తను సర్దుకుని, ప్రేమావేశంలో పెళ్లి చేసుకున్నానన్న భావం అతనిలో మొదలైంది. దాని ఫలితంగా ముక్తసరి మాటలు, ముభావమైన ప్రవర్తన ఎదుర్కొంటోంది ప్రియ.

ఆమెలో ఇదివరకు ఇష్టంగా చూసుకున్న లక్షణాలన్నీ ఇప్పుడు విమర్శనాత్మకంగా కనిపిస్తున్నాయి. నీ ముఖం కోలగా, బాపు బొమ్మలోని ముఖంలా ఉంటుందని ప్రేమించిన రోజుల్లో అన్న మనిషి, ఇపుడు...'నీది చిన్న ముఖం, కోడిగుడ్డులా ఉంటుంది. నీ కళ్లు నీ ముఖానికి పెద్దవిగా ఉండి పొడుచుకొచ్చినట్టున్నాయి. నీ మెడ కొంగమెడలా ఉంది' ఈ విధంగా సాగుతున్నాయి అతని వ్యాఖ్యానాలు.

తన వెంటపడి, 'నువ్వే నా ప్రాణం, నువ్వు లేకపోతే బతకలే'నని తనను పెళ్లి చేసుకున్న రాజేంద్ర, నెమ్మదినెమ్మదిగా మారిపోయి శాడిస్టిక్‌గా అంగాంగం వికృతంగా వర్ణించి, మానసికంగా హింసిస్తుంటే ఏం చెయ్యాలో తెలియక కుమిలిపోతోంది ప్రియ.

❄ ❄ ❄

ఆ రోజు ఆఫీసునుంచీ బయలుదేరి రవీంద్ర భారతిలో జరుగుతున్న 'మిస్ హైదరాబాద్' పోటీ ఉత్సవాలు చూసి ఇంటికి తిరిగి వచ్చారు ప్రియ, రాజేంద్ర.

ముందుగా వేసుకున్న ప్రోగ్రాం అయితే ఇద్దరూ తిరిగి వచ్చేటప్పుడు అలా హోటల్‌కి వెళ్లి సరదాగా డిన్నర్ చేసి రావాలి. కానీ ఎందుకో ఫంక్షన్ మధ్యలోనే రాజేంద్ర మొహం విసుగ్గా పెట్టి 'ఇంక ఎక్కడికీ వెళ్లే మూడ్ లేదు, తలనొప్పిగా ఉందం'టూ తిన్నగా ఇంటికి తీసుకువచ్చేశాడు. ఇంక ఆ రాత్రి కాళరాత్రే అయింది ప్రియకి.

పోటీలకి వచ్చిన అమ్మాయిలు అందంగా ఉన్నారనీ, అందమైన భార్య దొరకాలంటే అదృష్టం కలిసి రావాలనీ...ఇలా ఏవేవో మాటలతో ప్రియను బాధించడం మొదలెట్టాడు.

"అందం, తెలివితేటలతో బాటు అవకాశాలు కూడా ఉండాలి...అలాంటి రంగంలో రాణించాలంటే." ప్రియ ఉండబట్టలేక అనేసింది.

"ఓహో. అయితే, మనం ఉండేది హైదరాబాదులోనేగా. నేను నీకు అవకాశాలు కల్పిస్తే మాత్రం, అందుకు తగిన అందం నీకు ఉందనుకుంటున్నావా?" వ్యంగ్యంగా అన్నాడు రాజేంద్ర.

తను ఎంతో ప్రేమించే రాజేంద్ర ఇలా మారిపోవడంతో ఈ మనిషికి సమాధానం చెప్పడం కష్టమనుకుంటూ, చెమ్మగిల్లిన కళ్లతో ప్రియ అటు తిరిగి పడుకుంది.

❄ ❄ ❄

ఆదివారం కావడంతోటే, రాత్రి జరిగినదానికి మనశ్శాంతి లేక, నిద్రపట్టక ఇద్దరూ ఏడుగంటలైనా లేవలేదు. కాలింగ్‌బెల్ మోతకి ప్రియ లేచి వెళ్లి తలుపు తీసింది. పల్లెనుంచీ మామగారు, వాళ్ల పనులు చూసుకునే వీరన్న వచ్చారు.

"నమస్కారం, మామయ్యగారు, రండి" అంటూ ఆయన్ను లోపలికి ఆహ్వానించి, "ఏం, వీరన్నా, బావున్నావా? చుక్కి ఎలా ఉంది?" అంటూ వీరన్నని పలకరించింది.

వీరన్నకి ఈ మధ్యే మేనమావ కూతురు చుక్కితో పెళ్లైంది. చుక్కికి చిన్నతనంలో మశూచి పోకి ముఖంమీద అక్కడా అక్కడా గుంటలు పడ్డాయి. మొత్తంమీద మనిషి పోత పోసిన పల్లశిల్పంలా చక్కగా, చురుకుగా ఉంటుంది. వీరన్న తల్లి వద్దన్నా, వాడు చుక్కి మీదున్న ప్రేమతో ఆమెనే పెళ్లి చేసుకున్నాడు.

❄ ❄ ❄

మధ్యాహ్నం నిద్రలేచి రాజేంద్ర టీ తాగుతుండగా వీరన్న "చినబాబూ! ఈ ఊళ్లో మంచి బజారుకి తీసికెడతారేటండీ?" అని అడిగాడు.

"సరే. ఏం కొనాలేంటి" అని రాజేంద్ర అడిగాడు.

వీరన్న సిగ్గుపడిపోతూ "నాకేటి కాదండీ, మా చుక్కికి పట్నంనుంచీ ఏదైనా తీసికెడదారని నా కాడ దాచుకున్న డబ్బులు తెచ్చుకున్నానండీ" చెప్పాడు.

రాజేంద్ర నవ్వి "సర్లేరా, తీసికెళతా" అన్నాడు.

సాయంత్రం బైటకెళుతూ వీరన్నని తీసుకెళ్లాడు రాజేంద్ర. వీరన్న అక్కడ చుక్కి కోసం రకరకాల గాజులు, దండలు ఏవేవో కొనుక్కొచ్చేడు.

ఇంటికొచ్చేకా "ఆ గుంటలమొహం దానికి ఇన్నీ దేనికో, దాన్ని పెళ్లి చేసుకున్నదే కాక ఇవ్వు కూడాను" వెటకారంగా అన్నాడు రాజేంద్ర ప్రియతో.

ప్రియ ఏం మాట్లాడలేదు. "ఈ మనిషికి ప్రేమవిలువ ఏనాటికి తెలుస్తుందో" అని మథనపడుతూ వెళ్లిపోయింది లోపలికి.

❄ ❄ ❄

ఆ రోజు రాత్రి టీవీలో 'మిస్ యూనివర్స్' పోటీల కార్యక్రమం ప్రసారం అవుతోంటే అందరూ చూస్తున్నారు.

విశ్వసుందరి తలకి కిరీటం పెడుతూంటే వీరన్న--"ఏటండి, బాబూ, ఆయమ్మకి కిరీటం పెడుతున్నారు?" అని రాజేంద్రని అడిగాడు.

"ఈ ప్రపంచంలో చాలా దేశాల అందగత్తెల అందరికన్నా ఈవిడే అందగత్తెగా ఎంపికైంది, వీరన్నా, అందుకే ఆ కిరీటం." వివరించాడు రాజేంద్ర.

"అయ్యబాబో, ప్రపంచంలో అందరికన్నా నండి! ఏటండీ...మా సుక్కికన్నా అందంగా ఉన్నదేటండడీ" సాగదీసుకుంటూ అన్నాడు వీరన్న.

రాజేంద్ర, ప్రియ మొహాలు చూసుకున్నారు. రాజేంద్ర ఏదో అనబోతుండగా రాజేంద్ర తండ్రి "తా వలచింది రంభ, తా మునిగింది గంగ' అన్నాట్ట వెనకటి కొకడు. అలాగే ఉంది వీడి వ్యవహారం...వీడికి దాని మీదున్న ప్రేమ అలాంటిది మరి" అన్నాడు.

❄ ❄ ❄

రాత్రి పడుకుందామని పక్కచేరిన రాజేంద్రకి వీరన్న మాటలు పదేపదే గుర్తురావడం మొదలైంది. హఠాత్తుగా వీరన్న కురుక్షేత్రంలో విశ్వరూపం ధరించిన కృష్ణుడిలా తనకు ఏదో ఉపదేశం చేస్తున్నట్టు అనిపించింది. రకరకాల ఆలోచనలతో నిద్రపట్టక పక్కన అమాయకంగా నిద్ర పోతున్న ప్రియను చూడగానే, ఒక్కసారిగా రాజేంద్రలో భావావేశం పొంగింది. తనని ప్రేమించి, తనే సర్వస్వంగా భావించే ప్రియ, తన విపరీత ధోరణులకి విసిగిపోయిన ప్రియ...తను ఇంతకాలం అనవసరపు మాటలతో వేధించినా నా మీద ప్రేమతో నోరెత్తి ఒక్కమాటైనా అనలేదే! ఈ ప్రేమమయినా తను హింసించిం దనుకుని రాజేంద్ర తనలో తను మథనపడ్డాడు. పెళ్లై తనకు చేరువకాగానే ప్రియమీద నిర్లక్ష్యం పుట్టుకొచ్చింది. తమ ప్రేమ సఫలం కావాలని పెళ్లికి ముందు తామిద్దరూ ఎన్నిపాట్లు పడిందీ అన్నీ గుర్తొచ్చి ఆమెమీద ప్రేమ పొంగు కొచ్చింది. అంతర్మథనంతో అలిసిపోయిన రాజేంద్రకి ఆ రాత్రి చాలా ప్రశాంతంగా నిద్రపట్టింది.

❄ ❄ ❄

"ఏంటీ, ఇంకా నిద్ర లేవరా, ఆఫీస్ కెళ్లక్కర్లేదా?" అని తట్టి లేపుతున్న ప్రియ మాటలతో మెలకువ వచ్చింది రాజేంద్రకి.

అందంమీద తనకి ఇంతకాలం ఉన్న దృక్పథంలో మార్పు రాగానే ప్రియ అతని కంటికి ఎంతో అందంగా కనిపిస్తోంది. తొందరగా లేచి తయారై ఆఫీసుకు వెళ్లిపోయాడు.

❄ ❄ ❄

ఆఫీసునుంచీ రాజేంద్ర రావటం బాగా లేటయ్యింది. ఇంకా రాలేదేమిటని ప్రియ కంగారుపడుతూ వీధిలో నిలబడి చూస్తుండగా రాజేంద్ర స్కూటర్ ఆగింది. "ఏమిటింత లేటు, ఏం జరిగింది?" కంగారుగా అడిగింది ప్రియ.

"ఏం లేదు, బజారుకెళ్లి రావటం లేటయింది. సారీ" అంటూ ఉత్సాహంగా ఆమెకు కొత్తచీర, పూలు అందించాడు.

ఆ మాత్రానికే ప్రియ మొహం సంతోషంతో పున్నమి చంద్రుడిలా పొంగిపోవడం గమనించిన రాజేంద్ర మనసు సంతృప్తితో నిండింది. ఆనందం, తృప్తి నిండిన ముఖంతో ప్రియలో కొత్తసొగసులు చోటుచేసుకున్నాయి.

సంతృప్తి, సంతోషం మనసులో నిండితే, ఎవరైనా అందంగానే ఉంటారనిపించిన రాజేంద్ర 'తన ప్రేమజగతికి మహారాణైన ప్రియకి ఏ మిస్ యూనివర్స్ సాటి వస్తుంది!' అనుకుంటూ అప్రయత్నంగా ప్రియ చేయి పట్టుకుని లోపలికి తీసుకెళ్లాడు. ■

## సంతోషంగా వుండాలంటే...

కొంద రెప్పుడూ సంతోషంగా కనిపిస్తుంటారు. వారట్లా వుండేందుకు ఏం చేస్తారో పరిశోధించిన ఆక్స్‌ఫర్డ్ యూనివర్శిటీ వారిట్లా సెలవిస్తున్నారు-

ఉదయం త్వరగా లేచి చల్లని గాలిలో అటూ ఇటూ తిరగాలి. బూడిద, నలుపు, మాసినట్లున్న రంగులవి కాక ఆకుపచ్చ, పసుపు, ఆరెంజ్ రంగుల వస్త్రాలు ధరించాలి. తలలో పువ్వులు పెట్టుకోవాలి. వాటి నుంచి వచ్చే సుగంధం మనస్సును తాజాగా వుంచుతుంది. ప్రోత్సహించే వ్యక్తితో కనీసం రోజులో ఒక్కసారైనా మాట్లాడాలి. ఇష్టమైన సంగీతాన్ని రోజులో కాసేపైనా వినాలి. పాటలు, భజనలు కూనిరాగాలు తీయటం వల్ల మనశ్శాంతి కలుగుతుంది. కాసేపు పిల్లల మధ్య గడపాలి. పిల్లలతో కాలక్షేపం వల్ల టెన్షన్లు దూరమై, నూతనోత్సాహం కలుగుతుంది.

ఎన్.